నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
1
గురువారం | మే 16, 2024 | www.navatelangana.com

అర్హత లేకుండా వైద్య పరీక్షలు చేస్తే చర్యలు

డిప్యూటీ డీఎండ్‌హెచ్‌ఓ

ప్రయివేటు ఆసుపత్రుల్లో తనిఖీలు

నవతెలంగాణ-నర్సంపేట

అనుమతి తీసుకోకుండా, అర్హత లేకుండా వైద్య పరీక్షలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా ఉప వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. బుధవారం పట్టణంలోని వందన నర్సింగ్‌హోం, పావని నర్సింగ్ హోం, వీఎన్నార్ ఆసుపత్రి, లీలా ఆసుపత్రులను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారుల బందం తనిఖీలు చేసింది. పావని నర్సింగ్ హోంలో ఉండాల్సిన డాక్టర్లకు బదులుగా ఇతర డాక్టర్లు పని చేయడం,



అర్హత లేకుండా ల్యాబ్‌లను నిర్వహిస్తున్న సిబ్బందిని గుర్తించినట్లు తెలిపారు. సిబ్బంది ద్వారా మేనేజ్మెంట్‌కు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. మాతాశిశు సంక్షేమ అధికారి డాక్టర్ ఆచార్య గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే ప్రయివేటు ఆసుపత్రిలో తనిఖీలు చేశారు. ప్రయివేటు ఆసుపత్రిలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్ చేసినా, అవసరం లేకున్నా ఆపరేషన్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్వహించడం కూడా తప్పిదం అవుతుందన్నారు. ఈ తనిఖీ బందంలో మాతా శిశు ఆరోగ్య సంరక్షణ అధికారి డాక్టర్ ఆచార్య, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎల్ డీ కంప్యూటర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలే ప్రమాద సూచికలు..!

ఆదమరిస్తే అంతే సంగతులు

నిద్రావస్థలో ఆర్అండ్‌బీ అధికారులు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు

నవతెలంగాణ-రాయపర్తి

రోడ్డు మరమ్మతు పనులు చేపడుతూ రవాణా వ్యవస్థను మెరుగుపరిచే అధికారులు నిద్రావస్థ నుంచి తేరుకోకపోవడంతో రోడ్డుకు ప్రమాదస్థాయిలో ఏర్పడిన గుంత నుంచి వాహనదారులను కాపాడడానికి పిచ్చి మొక్కలే ప్రమాద సూచికలుగా నిలుస్తున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రం నుండి అంబేద్కర్ కాలనీ, కొత్త రాయపర్తి, మహబూబ్ నగర్, రాగన్న గూడెం, పెర్కవేడు గ్రామాల గుండా నెక్కొండ, మహబూబాద్ కు వెళ్లే వాహనదారులు నిత్యం ఇదే రోడ్డును ఉపయోగిస్తారు. ప్రతిక్షణం వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డుకు వైన్ షాప్ సమీపంలో గత కొంత కాలం క్రితం రోడ్డు బాక్స్ కల్వర్టు నిర్మించారు. కల్వర్ట్‌పై ప్రమాదస్థాయిలో గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. స్థానికులు, స్థానిక అధికారులు సంబంధిత అధికారులు ఆర్అండ్‌బీ అధికారులకు తెలిపిన స్పందించకపోవడం శోచనీయం. రోడ్డు మధ్యలో గుంత ఏర్పడిన తీరు చూసి వాహనదారులు ప్రమాదానికి గురికాకుండా స్థానికులు గుంతపై పిచ్చి మొక్కలు పెట్టి ప్రమాదాలను నివారిస్తున్నారు. లక్షల్లో ప్రజాధనాన్ని జీతం రూపకంగా తీసుకుంటున్న అధికారులు విధులను నిర్వర్తించకపోవడం సిగ్గుచేటు అని ప్రజలు దుయ్యబడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దు నిద్రను వీడి రోడ్డు మరమత్తు పనులు చేపట్టి ప్రమాద స్థాయిలో ఏర్పడిన గుంతను పుడ్చాలని ప్రజానీకం కోరుతున్నారు.



వర్ధన్నపేట ప్రగతిని దేశానికి చాటాలి

సెంట్రల్ టీమ్‌కు అన్ని విధాలా సహకరించాలి

సాధించిన ప్రగతి నివేదికలు సమర్పించాలి

డిఆర్డిఎ డిఆర్డిఓ కౌసల్యాదేవి

నవతెలంగాణ-వరంగల్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల ప్రగతిని దేశానికి చాటి చెప్పేలా ప్రతి ఒక్కరు కషి చేయాలని డిఆర్డిఎ డిఆర్డిఓ కౌసల్యాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని ఇల్లందలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈజీఎస్, సెర్ప్ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం సెంట్రల్‌టీం సందర్శన నిమిత్తం ప్రణాళికల రూపొందించి, ఎలాంటి సందేహాలకు అవకాశం లేకుండా పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సెర్ప్ ఉద్యోగుల సమన్వయ సహకారంతో ఉపాధి హామీ పనుల ప్రగతిని జాతీయస్థాయిలో చాటి చెప్పి తగిన గుర్తింపు పొందేందుకు ప్రతి ఒక్కరు కషి చేయాలని అన్నారు. ఇల్లందలో పనిచేస్తున్న సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం డిఆర్డిఓ కౌసల్యదేవిని గ్రామైక్య సంఘాల ప్రతినిధులు సహాయకులు సెర్ప్ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీఓ ధనలక్ష్మి, ఏపీవో నాగేశ్వరరావు, ఏపీఎం వేణు, సిబ్బంది గోలి కొమురయ్య, రమేష్, సురేష్, వీవో ప్రతినిధులు తూళ్ల శ్రావణి, స్వప్న, రజిత, ఫీల్డ్‌అసిస్టెంట్ రేణుక, వీవోఏలు కత్తి స్రవంతి, తక్కలపల్లి పద్మావతి, ఆకుల స్రవంతి, కారోబార్ రాజు, చోటేమియా స్వయం సహాయక సంఘాల సభ్యులు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

నవతెలంగాణ-ఖానాపురం

మండలంలోని ధర్మరావుపేట దుర్గమ్మ ఆలయంలో వెండి, బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి సుమారు 11గంటల సమయంలో దుర్గమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దుర్గామాత ధరించిన కేజీ45గ్రాముల కిరీటాన్ని, కాళ్ల కడియాలను అపహరించారని, దీంతో పాటు 15గ్రాముల బంగారు చైను, ముక్కుపుడకను దొంగిలించినట్లు తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న శివాలయంలో చొరబడి ఆలయంలో నిద్రిస్తున్న పదిమంది ఆంజనేయుల స్వాముల వద్దనున్న ఐదుసెల్ ఫోన్లను దుండగులు దొంగిలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలపడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మల్హార్‌లో 6,429 మంది ఓటెయ్యలే ?

నవతెలంగాణ-మల్హర్‌రావు

పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో ఈసారి 6,429 మంది ఓటు వేయలేదు. మండలంలో మొత్తం 15 గ్రామపంచాయతీల్లో ఓటర్లు 21,935 ఉండగా 15,466 మంది మాత్రమే ఓటు వేసి మిగతా 6,429 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. వీరిలో అత్యధికంగా పట్టణాల్లో ఉంటూ ఓటుహక్కు పల్లెల్లో ఉన్నవారే కావడం విశేషం. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 13 శాతం ఓటింగ్ తగ్గింది. వృద్ధులు, వికలాంగులు సైతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. కానీ మధ్య వయస్సు ఉన్నవారు మాత్రం ఓటుహక్కు వినియోగించుకోవడానికి ముందుకు రాకపోవడం గమనార్హం. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధం, ఓటు కీలకమని, అర్హులైనవారు ప్రతి ఒక్కరూ వేయాలని ప్రధాన రాజకీయ పార్టీలు విస్తతంగా ప్రచారం చేయడం మరోవైపు రాష్ట్ర ,ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, కళాకారులతో పాటల, ఆటల రూపంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికి ఓటింగ్‌శాతం మాత్రం పెరగలేదు. దీనికి తోడుగా మేజర్ గ్రామపంచాయతీ అయిన తాడిచెర్ల ముందస్తుగా ఓటింగ్ స్లిప్స్ పంచక పోవడం, ఎన్నికల రోజే బీఎల్‌ఓలు స్లిప్స్ ఇచ్చినట్లుగా హడావిడి చేయడంతో కొంతవరకు ఓటింగ్ తగ్గినట్లుగా బావించక తప్పదు.గుర్తింపు కార్డులు పట్టుకొని వచ్చిన కొందరు ఓటర్ల పేర్లు ఓటింగ్ లిస్టులో గల్లంతైన నేపథ్యంలో వారు ఓటు వేయకుండా ఇంటిబాట పట్టడంతో ఓటింగ్ శాతం తాడిచెర్లలో పడిపోయి మండలంలో తగ్గింది.

నిర్లక్ష్య ధోరణిలో జవాన్ల విధులు..!

ముడుపులిస్తే కార్మికుల విధుల్లో వెసులుబాటు

జవాన్లపై కొరవడిన క్రమశిక్షణ చర్యలు

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న జవాన్లు

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది జవాన్లు పనివేళల్లో సక్రమంగా హాజరు కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బల్దియా పరిధి 66డివిజన్లలో ఒక్కొక్క డివిజన్‌లో సుమారు ముగ్గురు జవాన్లను కేటాయించారు. కానీ విలీన గ్రామాల్లోనీ డివిజన్లలో కొన్ని చోట్ల ఒక్కొక్క డివిజన్‌కు ఒక్క జవాన్ ఏర్పాటు చేయడం వల్ల ఇంటింటికి చెత్త సేకరణలో లక్ష్యానికి తగ్గట్టుగా పనులు జరగడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఏదైనా కారణాల వల్ల జవాను విధుల్లోకి రాకుంటే జవాను నిర్వహించాల్సిన విధులు శానిటరీ ఇన్‌స్పెక్టర్లే విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తుంది. అందువల్ల ఒక్కొక్క డివిజన్లో ఒక జవాన్ ఉండటం వల్ల పారిశుధ్య పనులు నిర్వర్తించే క్రమంలో కొంత మేరకు ఇబ్బందులు తప్పటం లేదు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 150 మంది జవాన్లు ఉన్నారు. అందులో 20మంది ప్రభుత్వ జవాన్లు, మిగతా 120మంది జవాన్లు ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఒక్కొక్క డివిజన్ సుమారు ముగ్గురు జవాన్లు, విలీన గ్రామాల్లో ఒకరు లేదా ఇద్దరు జవాన్లు ఉన్నారు.



ఒక్కో జవాన్‌కు నెలకు 20లీటర్ల పెట్రోల్ ఇస్తున్నారు. అయినా డివిజన్‌లో పర్యవేక్షించడం లేదు. కొంతమంది జవాన్లు మద్యం సేవించి విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది జవాన్లు పారిశుధ్య కార్మికులపై అజామాయిషీ చెలాయిస్తున్నారని కార్మికులల్లో గుసగుసలు విని పిస్తున్నాయి. మరికొంత మంది జవాన్లు ఎక్కువ సంవత్సరాలు ఒకే డివిజన్లో విధులు నిర్వహించడం వల్ల చికెన్, మటన్, బిర్యానీ సెంటర్లలో, ఫంక్షన్‌హాల్లో అల్లం ఎల్లిగడల షాపుల వద్ద నెల నెల మామూలు వసూలు చేస్తు న్నారనే ఆరోపణలు బహిరంగంగా వెల్లు వెత్తుతున్నాయి. కొంతమంది జవాన్లు తమ వ్యక్తిగతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. అందువల్ల విధులు చేసే క్రమంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చర్చ సాగుతుంది. మరికొంత మంది జవాన్లు పారిశుధ్య కార్మికుల దగ్గర చేతివాటం తీసుకొని వారికి విధుల్లో వెసులుబాటు కల్పించడం వల్ల, తక్కువ పారిశుద్ధ కార్మికులతో వాడలో డ్రైనేజీలలో మురుగును తొలగించాలంటే ఎక్కువ సమయం పడు తుందని శానిటేషన్ అధికారులు చెప్తున్నారు. పారిశుధ్య కార్మికుల వద్ద ముడుపులు తీసుకొని, విధులు చేయకుండా పరిశుద్ధ కార్మికులు హాజరు నమోదైన అనంతరం తమ ఇండ్లకు జవాన్లే పంపిస్తున్నారు. మరి కొంతమంది జవాన్లు డివిజన్లలో అందుబాటులో ఉండటం లేదనే విషయం సంబంధిత ఉన్నత అధికారికి తెలువడంతో ఎక్కడ చర్యలు తీసుకుంటారో అనుకొని ముందస్తుగా కొంతమంది జవాన్లు పైరవీదారుల, రాజకీయ నాయకులతో ఒత్తిడి చేయి స్తున్నారా అనే సంశయం నెలకొని ఉంది. అందువల్ల ఉన్నత అధికారులు జవాన్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నగర ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్లక్ష్యపు నీడలో ఉన్న జవాన్లపై చర్యలు తీసుకోకపోతే పారిశుద్ధ్య పనులు జరిగేది ఎట్లా అనే విమర్శలు లేకపోలేదు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోని నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న జవాన్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు చెప్పుతున్నారు. ఏదేమైనప్పటికీ కమిషనర్ పట్టించుకొని నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్న జవాన్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే..!

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : డాక్టర్ రాజేష్ (బల్దియా సీఎంహెచ్‌ఓ)

బల్దియా పరిధిలో జవాన్లు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. లక్ష్యానికి తగ్గట్టుగా చెత్త సేకరణ చెయ్యాలి. వర్షాకాలం అతి సమీపంలో ఉన్నది కాబట్టి డ్రైనేజీల్లో పేరుకు పో యిన చెత్తను తొలగించేందుకు జవాన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. జవాన్లపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే నిజనిజాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటాం.

ధాన్యం తరుగు తీస్తే చర్యలు తీసుకుంటాం

-అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నవతెలంగాణ-ఖానాపురం

మిల్లర్లు ధాన్యం కొనుగోలులో ఆంక్షలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేసి ధాన్యంలో తరుగు తీస్తే సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంతో పాటు బుధరావుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు చేసే రైస్ మిల్లర్లతో చర్చించామని అన్నారు. ధాన్యం కొనుగోలులో తరుగు తీయొద్దని రైస్ మిల్లర్లను హెచ్చరించినట్లు తెలిపారు. తరుగు తీస్తే ఉన్నత అధికారుల దష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోల్లు సజావుగా జరుగుతున్నాయన్నారు. రైతులు కొంతమేరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రేడ్ (ఎ) ధాన్యాన్ని సైతం కామన్ ధాన్యం మాదిరిగానే కొనుగోలు చేస్తున్నారని రైతుల నుండి ఆరోపణలు వస్తున్నాయని, వాటిని పరిగణలోకి తీసుకొని మిల్లర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని రెండుమూడ్రోజుల్లో కొనుగోలు పూర్తి చేసి రైతులకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాకు సంబంధించి లారీలు నిర్ణీత సమయంలో ఏర్పాటు చేసుకొని రోజుకు మూడు నుండి నాలుగు లారీలు ధాన్యం ఎగుమతి చేయాలని అధికారులకు సూచించారు. హమాలీల సమస్య



ఉంటే ప్రత్యామ్నాయంగా హమాలీలను ఏర్పాటు చేసుకొని రైతులకు ఇబ్బందులు ఎదుర్కోకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి రైతులు తమ ధాన్యంలో తాలు, తేమ లేకుండా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని అన్నారు. ఒకవేళ ధాన్యంలో తాలు ఉంటే కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన పరికరాల సహకారంతో దాన్యంలో తాలును తొలగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శివప్రసాద్, డిసిఒ సంజీవరెడ్డి, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డిటి స్వప్న, క్వాలిటీ కంట్రోలర్ రాజయ్య, సీఈవో ఆంజనేయులు, తదితర సిబ్బంది లతోపాటు రైతులు పాల్గొన్నారు.



భట్టి, దుద్దిళ్లకు ఘన సన్మానం

తాడిచెర్ల డేంజర్ జోన్ సమస్యపై వినతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హోదాలో మొదటి సారిగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా,కాటారం మండలంలోని దుద్దిళ్ల స్వగ్రామం ధన్వాడకు వచ్చిన మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయ మూడో వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సిసెల్ చైర్మన్ దండు రమేష్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రమైన తాడిచెర్ల జెన్కో ఉపరితల బొగ్గుగని డేంజర్ జోన్ ప్రాంతంలోని నివాస గహాలు, బ్లాస్టింగ్ దెబ్బలతో కూలిపోయిన నివాస గహాల ఫోటోలు వారికి చూపించి, డేంజర్ జోన్ సమస్యపై వివరించినట్లుగా రమేష్ తెలిపారు. త్వరగా డేంజర్‌జోన్ సమస్య పరిష్కారానికి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లుగా తెలిపారు. ఇందుకు భట్టి, దుద్దిళ్ల సానుకూలంగా స్పందించినట్లుగా తెలిపారు.

'మోడీ' విస్మరించిన 'బయ్యారం ఉక్కు'

విభజన హామీ ఊసే ఎత్తని వైనం

హామీల అమలులో బీజేపీ, బీఆర్ఎస్ విఫలం

మానుకోట సభలోనూ మోడీ ప్రసంగం


నవతెలంగాణ-మహబూబాబాద్

పూర్తిగా వెనుకబడిన గిరిజన ఆవాస ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలో అధిక సంఖ్యలో ఆదివాసీ, లంబాడి గిరిజను కుటుంబాలు ఉన్నాయ. జిల్లా వ్యాప్తంగా 44శాతం గిరిజనులు, 10శాతం దళితులు, 40శాతం బలహీన వర్గాల ప్రజలు ఉన్నారు. వారు ఉపాధి కోసం బొంబాయి కలకత్తా, హైదరాబాద్, వరంగల్‌తో పాటు వివిధ ప్రాంతాలకు వలసవెళ్తున్న పరిస్థితి. అక్కడ పరిశ్రమల్లో కార్మికులుగా, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ అనారోగ్యంకు గురై మత్యువాత పడుతున్నారు. లక్షలాది ఎకరాల్లో విస్తరించిన ఇనుపరాయి ఖనిజ సంపద వినియోగించుకొని ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఉపాధి లభించి వలసలు తగ్గుతాయని ఆశించారు. ఇది మహబూబాబాద్ జిల్లా ప్రజల 3 దశాబ్దాల చిరకాల వాంఛ. విభజన హామీల్లో భాగంగా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం విస్మరించింది. మొన్న మానుకోటలో జరగిన సభలోనూ మోడీ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఊసే ఎత్తకపోవడం శోచనీయం. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంగా ఒక్క పరిశ్రమ కూడా లేదు. దీంతో మానుకోట జిల్లా అభివృద్ధి అతీగతీ లేకుండా పోతోంది.

పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నినాదంతో రెండుసార్లు ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాయి. మూడోసారి ప్రజలు బీఆర్ఎస్, బీజేపీ కపట వాగ్దానాలను ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో స్థానికులు లేరు. ప్రధానంగా ఈ ప్రాంతంలో 1,70,000 ఎకరాల్లో ఇనుప రాయి ఖనిజాలు నిక్షేపాలున్నట్లు ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లాలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్)కు చెందిన అధికార బంధాన్ని పంపించి విచారణ నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఖమ్మం వరంగల్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఇనుపరాయి ఖనిజాలు పుష్కలంగా ఉన్నట్లు గుర్తించి నివేదిక ఇచ్చారు. ఇనుపరాయి ఖనిజం వినియోగంతో మూడు వేల ఎకరాలలో ఐరన్ పరిశ్రమ ఉక్కు ఖనిజ కర్మాగారం ఏర్పాటు చేయవచ్చని గుర్తించారు. ఇందుకు అవసరమైన రైల్వేమార్గం నీటి వనరులు ప్రభుత్వ భూములు విద్యుత్ వనరులు ఉన్నట్లు గుర్తించి రక్షణ స్టీల్ సంస్థ తో ఒప్పందం కుదుర్చుకుని ఇక్కడి ఇనుపరాయి ఖనిజాన్ని తరలించారు. ఈ క్రమంలో తెలంగాణ, ఏపీ విభజన హామీలో భాగంగా బయ్యారం కేంద్రంగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2014 ఫిబ్రవరి 18న జరిగిన పార్లమెంట్ సమావేశంలో 13అంశంగా ఆరు నెలల్లో రూ.30వేల కోట్లతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పార్లమెంట్ చట్టం చేసింది. కానీ, 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ ఇచ్చిన హామీని పట్టించుకోలేదు.

పుష్కలమైన వనరులు

మహబూబాబాద్ జిల్లాలోని 10 మండలాలలో గ్రానైట్ రాళ్లు విస్తారంగా



ఉన్నాయి. జిల్లాలో 1759గ్రానైట్ గనులు ఉన్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రతిరోజు ఖమ్మం జిల్లాకు అక్కడి నుంచి కాకినాడ మద్రాస్ ఓడరేవుల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. జిల్లాలో లక్ష 70 వేల ఎకరాలలో 53 లక్షల టన్నుల ఘనపు మీటర్ల ఇనుపరాయి ఖనిజం, ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 50వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించవచ్చని గుర్తించారు.

మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం

బయ్యారానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో గుండ్రాది మడుగు రైల్వే స్టేషన్ నుండి ఇనుపరాయి మట్టి తరలించవచ్చు అని గుర్తించారు. గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజోలు గ్రామంలో 3000ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించారు. నీటి వనరులుగా పాకాల, మున్నేరు, వట్టి వాగు, అలిగేరు, గోదావరి నుండి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జిల్లాలో బయ్యారం పెద్ద చెరువు నుంచి నీటి జలాలను వాగులను వినియోగించుకోవచ్చు.ఇక్కడ తయారైన ఇనుప వస్తువులను కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమలో వినియోగించుకోవచ్చు. కాజీపేట రైల్వే స్టేషన్ ద్వారా ఉత్తర భారతదేశానికి ఉక్కును తరలించవచ్చు. జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల ద్వారా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చని సీపీఐ(ఎం), అఖిలపక్షం, ప్రజలు, పలు రాజకీయ పార్టీలు గుర్తించాయి. కానీ, 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు పరిశ్రమ ఏర్పాటులో ఒక్క అడుగు ముందుకు వేయలేదు. దీనికి తోడు అభివద్ధి ఫలాలను నిధులను, కార్పొరేట్లకు పట్టణాలకు తరలించింది. పరిశ్రమ ఏర్పాటుకు శాశ్వతంగా సమాధి కట్టేలా వ్యవహరించింది. ప్రతిపక్షాలు, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది

సెయిల్ ఆధ్వర్యంలో తప్పుడు నివేదికలు

2018 ఎన్నికల్లో అప్పటి బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉక్కు పరిశ్రమ నినాదం గట్టిగా ప్రజల నుండి గట్టిగా తాకింది దాంతో ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే తప్ప ఓటు పడవు అనే విషయం స్పష్టం అయింది. దాంతో ప్రజల మధ్యలో నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నినాదం తీసుకోవాలని బీజేపీ కుటిల యత్నం చేశారు. స్టీల్ అథారిటీ ఆధ్వర్యంలోనిని అధికార యంత్రంగానే బయారానికి పంపించారు మూడు రోజులపాటు ఈ ప్రాంతంలో పర్యటించిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికార యంత్రాంగం మోడీ ఆదేశాల మేరకు ఒక తప్పుడు నివేదికను తయారు చేసింది. ఈ ప్రాంతంలోని ఐరన్‌పూరులో 18 శాతానికి మించి ఐరన్ లేదని నాణ్యమైన ఐరన్ లేదని నివేదిక తయారు చేసి ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని తేల్చి చెప్పింది.

ఓట్లు దండుకుని చేసింది శూన్యం

తెలంగాణ రాష్ట్రంలో రెండోసారి జరిగిన 2018-19ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లు ఈ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ శ్రమ ఏర్పాటుకు పోరాడు తామని ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లు దండుకున్నారు. 2018 ఎన్నికల ముందు మహబూబాబాద్ జిల్లాలో కలెక్టరేట్ ప్రారంభానికి వచ్చిన కేటీఆర్ కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతాల్లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకూడదని నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో మానుకోట వచ్చిన కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో జిందాల్ సంస్థ భాగస్వామ్యంతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్నంతకాలం బీజేపీతో అంట కాగిన బీఆర్ఎస్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నినాదాన్ని వాడుకొని పరిశ్రమ ఏర్పాటును విస్మరించింది. ప్రధానమంత్రి హోదాలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు మహబూబాబాద్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఉక్కు పరిశ్రమ గురించి ఊసెత్తలేదు. కానీ, ఉక్కు పరిశ్రమను కడపకు తరలించి మానుకోటకు మోడీ తీరని అన్యాయం చేశారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నా జీవిత ఆశయం : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్

మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం కేంద్రంగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నా జీవిత ఆశయం. 2009లో గెలిచి కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నపుడు ఉక్కు పరిశ్రమ నినాదాన్ని కేంద్ర ప్రభుత్వంకు గొంతెత్తి చాటాను. ఈ ప్రాంతం అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వనరుల అధికంగా ఉన్నాయి. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ద్వారా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అవుతుంది.

ఉక్కు పరిశ్రమ కోసం నిరంతర ఉద్యమాలు : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య ఆధ్వర్యంలో నిరంతర ఉద్యమాలు పాదయాత్రలు నిర్వహించాం. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పై అన్ని పార్టీల అభ్యర్థులు వైఖరి తెలపాలి. పరిశ్రమ ఏర్పాటు కోసం ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లాలో పోరాటాలు నిర్వహించాం. అలాగే బయ్యారం గుట్టల నుంచి మానుకోట వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అఖిలపక్షం ఏర్పాటు చేసి పాదయాత్ర చేశాం. సీపీఐ(ఎం) అఖిలపక్షం ఆధ్వర్యంలో బయ్యారం కేంద్రంగా మూడు నెలల పాటు నిరంతర పోరాటాలు నిర్వహించాం. నిరంతరం ధర్నాలు రాసారోకాలు చేయడంతో పాటు ఈ ఎన్నికల్లో 50 వేల కరపత్రాలు ముద్రించి పంపిణీ ప్రచారం నిర్వహించాం.

ఏనుమాముల స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రి తనిఖీ



నవతెలంగాణ-హనుమకొండ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచిన వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించి ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తాపట్నాయక్ బుధవారం తనిఖీ చేశారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించి అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల షట్టర్ల తాళాలకు వేసిన సీళ్లను కలెక్టర్ తనిఖీ చేశారు.

ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూములకు సంబంధించిన లాగ్‌బుక్‌లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఉన్న సీసీ కెమెరాల పర్యవేక్షణకు సంబంధించిన వాచ్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూములు, భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ వివరాలను ఆయా నియోజకవర్గాల ఏఆర్వోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తహశీల్దార్లు విజయ్‌కుమార్, జగన్మోహన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యాక్ గ్రేడింగ్‌లో బిల్డింగ్ డివిజన్ క్రియాశీల పాత్ర

- కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

న్యాక్ గ్రేడింగ్‌లో కాకతీయ విశ్వవిద్యాలయ బిల్డింగ్ డివిజన్ క్రియాశీల పాత్ర పోషించిందని కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయ బిల్డింగ్ డివిజన్ లో అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్.వాసుదేవరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వీసీ ప్రసంగించారు. ఈ సందర్భంగా వీసీ రమేష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ప్రతీఒక్కరి కృషి ఉంటుందని సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వరంగ యూనివర్సిటీలను కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తన పదవీకాలంలో పార్ట్ టైం, కాంట్రాక్టు బోధనా సిబ్బంది, బోధనేతర ఉద్యోగులకు వేతనాల పెంపు చేయడం జరిగిందన్నారు. న్యాక్ గ్రేడింగ్ సమయంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా అన్నింటిని సమిష్టిగా ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్‌ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్‌ను బిల్డింగ్ డివిజన్ సిబ్బంది శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి మల్లారెడ్డి, ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, దూర విద్య సంచాలకులు ఆచార్య వి.రామచంద్రం, ఇంజనీర్‌లు పి.రామయ్య, జి.భవాని ప్రసాద్, ఫైనాన్సు ఆఫీసర్ తోట రాజయ్య, ఆడిట్ ఆఫీసర్ లింగంపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట



ఇటీవల కురిసిన గాలి దుమారం వర్ష బీభత్సాలకు ఇంటి పైకప్పు రేకులు కోల్పోయి నిరాశ్రయులైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు సుమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పత్తి పాక గ్రామంలో నిరాశ్రయులైన గజ్జి సరోజన, సరితల ఇండ్లను బుధవారం ఆయన సందర్శించి వారి ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ వర్షాలతో నిరాశ్రయులైన నిరుపేద కుటుంబాలను రెవెన్యూ అధికారులు సందర్శించి వారి స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

నూతన హాస్టల్ డైరెక్టర్‌కు విద్యార్థుల సన్మానం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



కాకతీయ విశ్వద్యాలయ హాస్టల్ డైరెక్టర్‌గా డీన్ గాదె సమ్మయ్య బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించగా విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ సమ్మయ్య గతంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ హెడ్‌గా, బాస్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆచార్య గాదే సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థుల సమస్యలు తెలుసుకుని,వారికి నాణ్యమైన భోజనము, వసతి సంపూర్ణ ఆరోగ్యం ఉండే విధంగా తగు జాగ్రత్తలు,చర్యలు తీసుకుంటానన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా పే బ్యాక్ సొసైటీలో భాగంగా పేదల చదువు కొరకు నిస్వార్థంగా, నిష్పక్ష పాతంగా, పారదర్శకంగా సేవలు అందిస్తానన్నారు. హాస్టల్ డైరెక్టర్‌గా నియమితులైన ఆచార్య సమ్మయ్యను ఘనంగా సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఎల్పి.రాజ్‌కుమార్, సూర్యనారాయణ, డాక్టర్ రాజకుమార్, బ్రహ్మయ్య, సురేష్, మధుకర్ రావు, రామచందర్, రాధిక, ఉషా కిరణ్మయి, స్వప్న, లక్ష్మి, హాస్టల్స్ కేర్ టేకర్స్, ఆఫీస్ సిబ్బంది రజిత, భాస్కర్, చిరంజీవి,నవీన్ విద్యార్థిని విద్యార్థులు ఆచార్య సమ్మయ్య ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-ఆత్మకూరు

గురువారం ఆత్మకూరు సబ్ స్టేషన్ లో మల్కపేట 11 కేవి ఫీడర్ లో ఉదయం 7 గంటల నుండి ఉదయం 10 గంటల వరకు మెయింటెయిన్స్ పనుల నిర్వహణ చేస్తున్నందు వల్ల మండలంలోని కొత్తగట్టు , మాల్కపేట, తిరుమలగిరి గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఎఈ రవికుమార్ తెలిపారు.

డీటీడీవో అవినీతిపై విచారణ చేపట్టాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయప్రతినిధి

గిరిజన శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న హనుమకొండ జిల్లాలో డిటిడిఓగా పని చేస్తున్న ప్రేమకళారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత మూడు సవత్సరాలుగా పని చేస్తూ గిరిజన సంక్షేమశాఖ అశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ హాస్టల్ లో పనిచేస్తున్న వార్డెన్, కాంటిజెన్స్ ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతూ ఎలాంటి కారణాలు లేకుండా ట్రాన్స్‌ఫర్ సస్పెండ్ చేస్తూ ఉద్యోగుల కు భయభ్రాంతులకు గురిచేసి లక్షల రూపాయలు వసూలు చేస్తుందని ఆరోపించారు. ఒక్కొక్క వార్డెన్ కు రెండు మూడు హాస్టళ్లో బాధ్యతలు ఇచ్చి వారి దగ్గర నుండి డైట్ బిల్లులలో బిల్లులలో 20శాతం డబ్బులు వసూలు చేసి అక్రమ సంపాదనకు పాల్పడుతున్న అధికారిణిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బానోతు గోవింద్‌నాయక్ ,వరంగల్ జిల్లా అధ్యక్షులు బాధవత్ భాస్కర్‌నాయక్, మోహన్,రాజు,ఈర్య పాల్గొన్నారు.



కామ్రేడ్ సుందరయ్య జీవితం నేటి సమాజానికి ఆదర్శం

- సుందరయ్య స్ఫూర్తితో ప్రజాపోరాటాలు నిర్వహించాలి
- 39వ వర్ధంతి సభలో సీపీఎం నేత జంపాల మురళీ



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కామ్రేడ్ సుందరయ్య జీవితం నేటి సమాజానికి ఆదర్శమని ఆయన స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం నాయకులు జంపాల మురళీ పిలుపునిచ్చారు. బుధవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి 39వ వర్ధంతి సందర్భంగా హన్మకొండ న్యూశాయంపేట కందుల బండ ప్రాంతంలో సీపీఎం కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించడం జరిగింది. జాటోత్ విజయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసభకు ప్రధానవక్తగా విచ్చేసిన సీపీఎం నాయకులు జంపాల మురళి మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో ఒక భూస్వామ్య కుటుంబంలో జన్మించారని ప్రాథమిక విద్యను గ్రామంలోని వీధి బడిలో అభ్యసించి ఏలూరు, రాజమండ్రి, మద్రాసులో ఉన్నత విద్యను అభ్యసించారన్నారు. అసలు పేరు సుందరరామిరెడ్డి అయితే రెడ్డి అనే కుల సూచక పదాన్ని తొలగించి కులవ్యవస్థను నిరసిస్తూ దళితులకు ఊరులో బావినీటిలో వాటా ఇవ్వాలని పోరాటం చేశారని, సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేసి కుల వర్గ విభేదాలు లేని సమాజంకోసం కృషి చేశారని కొనియాడారు.

తన 17వయేటా విద్యార్థి దశలోనే స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ ఉద్యమాలకు ఆకర్షితుడై ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొని జైలుపాలయ్యారని ఆ సమయంలోనే జైల్‌లోని అభ్యుదయవాదులు, కమ్యూనిస్టులతో ఏర్పడిన పరిచయాలతో కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితులై జైలు నుండి విడుదలైన వెంటనే తన స్వగ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి వారి సమస్యలపై పోరాడరని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని స్థాపించి పోరాటాలు నిర్వహించారన్నారు. సంపూర్ణ స్వాతంత్ర నినాదం కమ్యూనిస్టు పార్టీ వలనే మొదలైందని అందులో సుందరయ్య కృషికూడా ఉందని తెలిపారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీలో చేరి అమీర్ హైదర్ ఖాన్ గారి నాయకత్వంలో దక్షిణ భారతదేశ బాధ్యతలు స్వీకరించి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి అవిశ్రాంత కషి చేశారని

సంతానం ఉంటే స్వార్థం పెరిగి ఉద్యమానికి ఆటంకంగా భావించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న ఆదర్శమూర్తి సుందరయ్య అని కొనియాడారు. 1936లో అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటులో సుందరయ్య విశేషంగా కృషి చేశారన్నారు. దక్షిణ భారతదేశంలోనే కాక దేశంలోని వివిధ రాష్ట్రాలలో కమ్యూనిస్టు ఉద్యమానికి, పార్టీ నిర్మాణానికి విశేషంగా కృషి చేశారు, పార్టీ జాతీయ కమిటీ కార్యదర్శిగా ఎన్నికై బెంగాల్, కేరళ, త్రిపుర వంటి రాష్ట్రాల్లో పార్టీ అధికారంలోకి రావడానికి కషి చేశారని, రెండో ప్రపంచ యుద్ధసమయంలో నాలుగేళ్ల పాటు అజ్ఞాత జీవితం గడిపారని, కమ్యూనిస్టు గాంధీగా, పిఎస్‌గా పేరు గాంచిన సుందరయ్య తనకు వారసత్వంగా వచ్చిన భూమిని పేద ప్రజలకు పంచి పెట్టారని, నెల్లూరులో ప్రజా వైద్యశాల స్థాపించి ప్రజలకు ఉచితంగా వైద్యం అందించారని కొనియాడారు.

ప్రపంచంలో గుర్తింపు పొందిన మహోన్నత తెలంగాణ సాయుధ పోరాటాన్ని నిర్వహించి పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచి పెట్టారని 1952లో రాజ్యసభకు ఎన్నికై పార్లమెంటులో కమ్యూనిస్టు పక్ష నాయకుడిగా, ప్రతిపక్ష నాయకుడుగా వ్యవహరించిన మొదటి వ్యక్తి సుందరయ్యని, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికై ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంటుకు, అసెంబ్లీకి సైకిల్ పై వెళ్లిన తొలి ప్రజా ప్రతినిధిగా రికార్డు సష్టించారని, అనేక రచనల ద్వారా ప్రజలను పోరాటాల వైపు మళ్లించిన సుందరయ్య 1985 మే 19వ తేదీన ఈ లోకాన్ని విడిచి వెళ్లారని నేటికీ 39సంవత్సరాలు కావస్తున్నా ఆయన జీవితం కార్మికులు, కర్షకులు, శ్రమజీవులు ఉన్నంతవరకు ఆయన ఆశయాలను సాధించడం కోసం అయన జీవితం స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించాలని ఆయన కలలుగన్న సమ సమాజ స్థాపనకు అన్ని వర్గాల ప్రజలు పాటుపడాలని, అందుకు సీపీఎం కాజీపేట మండల కమిటీ కూడా తమ వంతు బాధ్యత నిర్వహిస్తుందని అన్నారు.

ఈ వర్ధంతి సభలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, మదన్ చారి, నరేష్, అఖిలేష్, సంటి, విమల, సరూప, సురేష్, రాజేశ్వరి, రేణుక, కల్పన, ఉమా, భారతి, వినోద, రాజు, కోమల, తులసి, పద్మ వందమంది ప్రజలు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు యూనిఫామ్ క్లాత్ పంపిణీ



నవతెలంగాణ-ఆత్మకూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఉచితంగా ఒకజత స్కూల్ యూనిఫామ్ అందజేస్తుంది. 2024-25 సంవత్సరానికి ఆత్మకూరు మండలంలోని పరిధిలోని ఆయా స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్‌లకు ట్టేందుకు బుధవారం నోడల్ అధికారి రాజేందర్, ఎంఇఓ , ఎపిఎం, స్వర్ణ భారతి ఆధ్వర్యంలో అందజేశారు.

ఈ సందర్భంగా నోడల్ అధికారి రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థుల కొలతలతో యూనిఫామ్ కుట్టించి ఆయా స్కూల్లో ప్రధానోపాధ్యాయులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఇఓ రమాదేవి , స్వర్ణ భారతి సభ్యులు పాల్గొన్నారు.

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ అందించడానికి ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్ క్లాత్‌ను స్వయం సహాయక సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం స్వయం సహాయక సంఘం సభ్యులకు యూనిఫాం క్లాత్ పంపిణీ కార్యక్రమం మండల నోడల్ ఆఫీసర్, ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఫణిచంద్ర పాల్గొని యూనిఫామ్ క్లాత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాల ప్రారంభ గడువులోగా యూనిఫామ్స్ కుట్టి విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



నవతెలంగాణ-ఆత్మకూరు

ప్రమాదవశాత్తు మృతిచెందిన నాగుపూరి మహేష్ 1990-91 ఎస్-ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన నాగుపూరి మహేష్ కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మహేష్ పదవ తరగతి మిత్ర బృందం బుధవారం కుటుంబ సభ్యులకు బుధవారం రూ.30 వేలు అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. స్నేహితుడు మహేష్ కుటుంబానికి అందుబాటులో ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఏ అవ సరం వచ్చినా మేమంతా ముందుంటాంని భరోసాఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రులు మునుకుంట్ల సతీష్, పరికరాల వాసు, పాపని రవీందర్, బయ్య శ్రీధర్, మూల ప్రవీణ్, లక్కర్స్ ఈశ్వర్, పలకల రాజమల్లారెడ్డి, కాసర్ల రాజు, రాస మల్ల పరమేశ్వర్, ఊకంటి వెంకట్ రెడ్డి, కొత్తగట్టు అశోక్ , పాయిరాల సుగ్రీవుడు, తాళ్లపల్లి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడి హేయం

నవతెలంగాణ-నడికూడ

ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఏక రీతిన టిఏ, డిఏ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠి చార్జి చేయించడం సరైనది కాదని పిఆర్టియు నడికుడ మండల శాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పిఒ, ఎపిఒలకు రోజుకు రూ 600, ఒపిఒ లకు రూ 400 రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం.691 ని ఈ నెల 11 న విడుదల చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారమే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో పిఒ, ఎపిఒలకు రూ 3150 లు చెల్లించగా, నారాయణఖేడ్ లో రూ 2400 మాత్రమే ఇచ్చారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు విరుద్ధంగా సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో తక్కువ పారితోషకం చెల్లించడం సరైనది కాదని అన్నారు.

ఒకే పార్లమెం ట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించి నందుకు ఉపాధ్యాయులు, ఉద్యోగుల పై ఎవరి ఆదేశాల మేరకు కానీ పోలీసు లు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు ఎప్పుడు ఎక్కడ జరగకుండా అదేవిధంగా ఎలక్షన్స్ అయిన రోజే ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇప్పించే విధంగా ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో..!





- అప్పులో ఊబిలో కూరుకుపోయిన మాజీ సర్పంచ్‌లు
- అభివృద్ధి కోసం చేసిన అప్పులు తీర్చలేక మనోవేదన
- కలెక్టర్ స్పందించి బిల్లులు ఇప్పించాలని వేడుకోలు

నవతెలంగాణ-నడికూడ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభివృద్ధి చేసే ఉద్దేశంతో గత ప్రభు త్వ హయాంలో ప్రత్యేక నిధులు కేటాయించి మనఊరు-మనబడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పథకానికి నడికూడ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలు ఎంపికయ్యాయి. ప్రభుత్వం ఈ పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి కలెక్టర్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి పనులు చేపట్టారు. సంబంధిత అధికారులతో రికార్డు చేయిస్తూ రికార్డు ప్రకారం బిల్లులు చెల్లించుకుంటూ పనులు పూర్తి చేశారు. చేసిన పనులకు కొంత మేరకు బిల్లులు చెల్లించారు. ఇంకా రావాల్సిన బిల్లులను చెల్లించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తుంది. దీంతో అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మన ఊరు-మనబడి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెట్టి ఇప్పుడు అమ్మబడి, ఆదర్శ పాఠశాలల పేరుతో తూతూ మంత్రంగా కొనసాగిస్తుంది. అయితే చేసిన అభివృద్ధి పనులకు తెచ్చిన అప్పులు, పెరగడంతో, తమకు రావాల్సిన ఇంకా కొంత బిల్లులు చెల్లించకపోవడంతో మాజీ సర్పంచ్‌లు అప్పులు తీర్చలేక తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. అధికారుల ఆదేశాలతో ప నులు అప్పులు చేసి పనులు చేస్తే తీరా ప్రభుత్వం మారాక మాకు బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు బిల్లులు చెల్లించాలని కోరారు.

అప్పులు తీర్చలేక రోడ్డున పడుతున్నాం : ఊర రవీందర్‌రావు, నడికూడ మాజీ సర్పంచ్



గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధి కోసం అప్పులుచేసి పనులు పూర్తి చేశాం. అయితే అప్పటి ప్రభుత్వం కొంత మేరకు బిల్లులు చెల్లించింది. కానీ ఇంకా రావాల్సిన బిల్లులు చాలా ఉన్నాయి. ఈ క్రమంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కన పెట్టి అమ్మబడి, ఆదర్శపాఠశాలలపేరుతో మరో పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకానికి సంబంధించిన బిల్లులు ఈ ప్రభుత్వం చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. తెచ్చిన అప్పులు చెల్లించకలేక తమ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బిల్లులు చెల్లించాలి.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-దామెర

దామెర మండలంలోని 163 జాతీయ రహదారి పసరుగొండ క్రాసు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం ఊరుకొండ గ్రామానికి చెందిన ఒకరు. వంగపాడు గ్రామానికి చెందిన మరొకరు స్పెండర్ వాహనంపై వెళ్తుండగా పరకాల కు చెందిన వ్యక్తి మరొక ద్విచక్ర వాహనంపై ఎదురుగా అతివేగం గా వచ్చి ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయినాయి వీరికి మెరుగైన చికిత్స కోసం వరంగల్ లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడికి తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-బచ్చన్నపేట

బచ్చన్నపేట మండలంలోని ఇటికలపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దూడల కనకయ్య తన కూతురును బుధవారం ఉప్పల్‌లో పరీక్షకు తీసుకువెళ్లారు. పరీక్ష పూర్తి అయిన అనంతరం రేపు మరో పరీక్ష ఉండడంతో అక్కడి నుండి గజ్వేల్ నియోజకవర్గంలోని వరదరాజపురం గ్రామంలో తన కూతురిని వదిలి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు సాయంత్రం వరదరాజపురం ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యారు. ప్రమాద సమయంలో అతని కారులో ఉన్న బెలూన్లు ఒక్కసారిగా తెరుచు కోవడంతో ప్రాణహాని తప్పిందని స్థానికులు తెలిపారు. అదే సమయంలో ఆయనను ఆర్‌వీఎం ఆసుపత్రి ఒంటిమామిడి నందు చేర్పించి చికిత్స అందించారు. ప్రస్తుతం కనకయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారని బంధువులు తెలిపారు.



ఔషధ నియంత్రణ అధికారుల దాడులు

- మెడికల్ షాప్ నిర్వాహకునిపై క్రిమినల్ కేసు నమోదు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఔషద నియంత్రణ శాఖ వరంగల్ సహాయ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జనగామ జిల్లా ఔషద నియంత్రణ అధికారి బాలకృష్ణ, వరంగల్ జిల్లా అధికారి అరవింద్ కుమార్ బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించి అనుమతులు లేని మెడికల్ షాప్ నిర్వాహకుని పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. జిల్లాలోని లింగాలఘణపురం మండలం చీటూర్ గ్రామంలో ఔషద నియంత్రణ శాఖ అనుమతులు లేని మెడికల్ షాప్‌పై దాడులు నిర్వహించి 49 రకాల అల్లోపతి మందులను స్వాధీనం చేసుకున్నారు. సదరు నిర్వాహకులు రాకేష్ కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కేసును జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, జనగామ కోర్టులో ఇంటిమేట్ చేసి సదరు స్వాధీన పర్చుకున్న మందులను కోర్టులో అప్పజెప్పారు. దీంతో పాటు ఘనపూర్ పట్టణంలో నిర్వహించిన సంయుక్త దాడులలో ఔషద చట్టం నిబంధనలు ఉల్లంగించిన మందుల దుకాణలకు నోటీసులు జారీ చేశారు. ఈ దాడులలో జయశంకర్ భూపాలపల్లి ఔషద నియంత్రణ అధికారి పి.పావని, వరంగల్, జనగామ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మారిన ఉద్యానవన శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలోని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు మారాయని, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ తెలంగాణ హైదరాబాద్ వారు కొత్తగా ఎయిర్టెల్ సిమ్‌లను మంజూరు చేసినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కెఆర్. లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు గతంలో వాడిన ఫోన్ నంబర్లు ఇకనుండి పనిచేయవని, రైతులు తమ పంటలకు సంబంధించి కొత్త నంబర్ల ద్వారానే సలహాలు, సూచనలు పొందాలని ఆమె సూచించారు. జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి కెఆర్. లత 8977714093, జనగామ నియోజకవర్గ అధికారి రవికాంత్ 8977714094, పాలకుర్తి, స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గ అధికారి జి.ధీరజ్ 8977714095 కొత్త నంబర్లలో రైతులు సంప్రదించాలని ఆమెకు కోరారు.

తేనెటీగల దాడిలో ఉపాధి కూలీలు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

చిల్పూర్ మండలంలో ఫతేపూర్ గ్రామంలో బండ్లగట్టు తూములో ఉపాధి హామీ పథకం కింద బుధవారం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో తేనెటీగల దాడిలో ఉపాధి కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం గుగులోతు బాలు, అరుణ, తిమ్మాపురం రాజహంస, అరుణ్, బానోత్ భీమా, గుగులోత్ పీనా, తేనెటీగల దాడితో అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. అధికారులు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.



ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల

మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ, దళితరత్న అందే యాకయ్య తండ్రి అందే మల్లయ్య (75) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు వివిధ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ యాకయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన మండల పార్టీ బాధ్యులు, జిల్లా నాయకులు, గ్రామాధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ భక్తులకు బియ్యం అందజేత

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని మాణిక్యపురం ఆంజనేయస్వామి గుడికి హనుమాన్ భక్తులకు మాజీ 6వ వార్డు సభ్యులు రాగం శ్రీలత నారాయణ యాదవ్ 50 కిలోల బియ్యం బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చాపల రాజు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ విజయభాస్కర్, శ్రీ హనుమాన్ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెయిన్ బో యూత్ ఆర్థిక సహాయం

నవతెలంగాణ-తరిగొప్పుల

మండల పరిధిలోని అక్కరాజుపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బొంత లచ్చమ్మ కుటుంబాన్ని గ్రామానికి చెందిన రెయిన్‌బో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకంరాజు ఆధ్వర్యంలో బుధవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు గౌడ్, అక్తర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక : కలెక్టర్ రిజ్వాన్ భాషా



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఈనెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ఎన్నికలు జరుగనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. కలెక్టరేట్లోని ప్రధాన సమావేశం మందిరంలో ఆయన బుధవారం సంబంధిత జిల్లా అధికారులతో ఈ విషయమై సమీక్ష చేశారు. జనగామ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు గ్రాడ్యుయేట్లు 23,419 మంది ఉన్నట్లు తెలియజేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జనగామ జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘన్పూర్ డివిజన్లు ఉండగా అందులో జనగామ డివిజన్లో 9341 పురుష ఓటర్లు 5544 మహిళలు ఇతరులు ఒక్కరు ఉన్నట్లు మొత్తంగా 14,886 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే స్టేషన్‌ఘన్పూర్ డివిజన్లో 5574 పురుష ఓటర్లు, మహిళలు 2959 ఉన్నట్లు మొత్తంగా 8533 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పురుష ఓటర్లు 14,915 మహిళా ఓటర్లు 8503 ఇతరులు ఒకటి నమోదవ్వగా మొత్తంగా 23,419 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు తెలియజేశారు. 85 సంవత్సరాలు దాటిన వారు ముగ్గురు ఉన్నట్లు తెలియజేశారు. అదేవిధంగా దివ్యాంగులు 506 పురుషులు ఉండగా 219 మహిళలు మొత్తంగా 725 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. telangana.gov.in వెబ్‌సైట్‌లో పోలింగ్ కేంద్ర వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.

జిల్లాలో 74.96 శాతం పోలింగ్ - గతం కంటే 6.6 శాతం అధికం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలో గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం అధికంగా పెరిగిందని, జిల్లాలో 74.96 సగటు పోలింగ్ శాతం నమోదైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి 6.6 శాతం అత్యధికంగా పోలింగ్ నమోదు కావడం విశేషమని, 2019లో జిల్లా సగటు పోలింగ్ శాతం 68.26 కాగా, ఈసారి 74.96 శాతం మంది ఓటును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా చూస్తే జనగామ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 74.68 శాతం, ఘనపూర్ (స్టేషన్)లో 78.77 శాతం,పాలకుర్తిలో 71.43శాతంగా పోలింగ్ నమోదైంది. 2019లో జనగామలో 68.26, ఘనపూర్(స్టేషన్) లో 70.42, పాలకుర్తిలో 66.11 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచడం కోసం విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి చోటా ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను వివరించి, వారు ఓటు హక్కును వినియోగించుకునేలా ఎంతగానో కృషి చేయడం జరిగిందని, ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు గాను గ్రామగ్రామాన కళాకారులచే ప్రచార కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అలాగే రద్దీ ప్రాంతాల్లో విద్యార్థులచే ఫ్లాష్ మాబ్‌లు, మానవహారాలు, ర్యాలీలు నిర్వహించి, ఓటు గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి దివ్యాంగులకు సైన్ లాంగ్వేజ్‌లో అవగాహన కల్పించామని, 850 వయోవృద్ధులకు, ట్రాన్స్‌జెండర్‌లకు ఓటుహక్కు మన ఆయుధమనే నినాదాన్ని చేరవేశామన్నారు. అన్ని విధాలుగా ఓటు హక్కు బాధ్యతను సక్రమంగా, తప్పనిసరిగా ఉపయోగించాలనే భావన ప్రజల్లో కలిగించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,జిల్లాలో అత్యధిక ఓటరు నమోదుకు ఎంతో కృషి చేశామన్నారు. ఓటింగ్ శాతం పెంచడంలో సహకరించిన ప్రజలకు, యువతకు, అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ కృతజ్ఞతలు తెలిపారు.



విపత్తులో ఆదుకునే నేస్తానికి...
నీడ కరువు..!

- సొంత భవనం లేక గత ఐదు సంవత్సరాలుగా ఎండలోనే...



ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సిహెచ్. శ్రీరాములు

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

పాలకుర్తి నియోజకవర్గంలో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, పెద్దవంగర నాలుగు మండలాలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో 2019 మార్చిలో అగ్నిమాపక కేంద్రాన్ని పాలకుర్తిలో ప్రభుత్వం నెలకొల్పింది. తాత్కాలిక వసతి కోసం సోమేశ్వర దేవస్థానంలోని సత్రాలలో ఆశ్రయం కల్పించారు. నాటి నుండి నేటి వరకు సిబ్బంది, అగ్నిమాపక కేంద్రం మాత్రం సత్రాలలో కొనసాగుతుండగా అగ్నిమాపక యంత్రం మాత్రం ఎండలోనే మగ్గుచున్నది. పాలకుర్తి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సిహెచ్. శ్రీరాములును వివరాలు కోరగా పాలకుర్తి దేవస్థానం సమీపంలోనే ప్రభుత్వం 20 గుంటల భూమిని ఫైర్‌స్టేషన్ కొరకు కేటాయించిందని, అట్టి భూమికి చుట్టూ హద్దులు కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ఫైర్‌స్టేషన్లో మొత్తం 16మంది సిబ్బంది ఉండాలని, ప్రస్తుతం ఆరుగురు సిబ్బందితో మాత్రమే కొనసాగుతుందని వివరించారు. రాత్రి, పగలు రెండు షిఫ్ట్‌లకు గాను షిఫ్టుకు ఏడుగురు చొప్పున తప్పనిసరిగా డ్యూటిలో ఉండవలసిన అవసరం ఉందని అన్నారు. ఫైర్ స్టేషన్‌కు సిబ్బంది కొరత ఉందని, మఖాము కొరకు దేవస్థానం వారు రెండు గదులు ఇచ్చారు. ఇబ్బందిగానే డ్యూటి చేయవలసి వస్తుందని వారు అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విధులు నిర్వహించడం సవాల్ గానే కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం వీలైనంత త్వరలో అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుందని సిబ్బంది జి.శ్యాంసుందర్, బి.కిరణ్ కుమార్, బి.అశోక్, బి.వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.



విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి

నవతెలంగాణ-గార్ల

విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృత్యువాత పడిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పూమ్యతండాకు చెందిన కాజా పఠాన్ అనే రైతుకు చెందిన రెండు పాడి గేదెలు గడ్డి మేసేందుకు సమీపంలోని గార్ల పెద్ద చెరువుకు కొన్ని రోజుల క్రితం వెళ్ళినట్లు తెలిపారు. మేతకు వెళ్ళిన పాడి గేదెలు ఎంత వెతికినా దొరకక పోవడంతో, సమీపంలోని పెద్ద చెరువు ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో చనిపోయి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు బాధిత రైతుకు సమాచారం అందించినట్లు తెలిపారు.గత కొన్ని రోజుల క్రితం కూడా ఇదే రైతుకు చెందిన ఆవు సైతం విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడిందని భాధిత రైతు వాపోయాడు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఎక్కువ ఎత్తులో ఏర్పాటుచేయాలని సంబంధిత శాఖ అధికారులకు సమీపంలోని రైతులు ఎంతచెప్పినా పట్టించుకోలేదని బాధిత రైతు, స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు మరమ్మత్తులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పాడి గేదెలు మృతి చెందిన నష్టపోయిన రైతు పఠాన్‌కు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.



విద్యుత్ మరమ్మత్తులు చేపట్టి తాగునీటిని అందించాలి

నవతెలంగాణ-గార్ల

మండలంలోని చిన్న కిష్టాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ఇటీవల అకాల వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు అన్నారు. చిన్న కిష్టాపురం గ్రామంలో న్యూ డెమోక్రసీ అధ్వర్యంలో విద్యుత్ మరమ్మత్తులు చేసి తాగునీటిని అందించాలని బుధవారం గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో మిషన్ భగీరథ నీరు సరిపడకపోవడంతో గ్రామ పంచాయతీ అధ్వర్యంలో స్థానిక బావి అందిస్తున్న నేపథ్యంలో గత వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్, పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ మరమ్మత్తులు చేపట్టి తక్షణమే నీటిని అందించాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సరితను వివరణ కోరగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తక్షణమే మరమ్మత్తులు చేయించి తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

మృతిరాలు కుటుంబానికి బియ్యం అందజేత


నవతెలంగాణ-గార్ల

ఇటీవల అస్వస్థతకు గురై మృతి చెందిన మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ వార్డు సభ్యురాలు భూక్య జ్యోతి కుటుంబానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ధనియాకుల రామారావు అధ్వర్యంలో బుధవారం 50 కేజీల బియ్యాన్ని వితరణగా జ్యోతి భర్త మోహన్‌కు అందించారు. మృతిరాలు జ్యోతి కుటుంబానికి కాంగ్రెస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించారు. బియ్యం అందజేసిన వారిలో గ్రామ కమిటీ నాయకులు పి.బిక్షపతి, బి.నవీన్, కె.వీరన్న, శేఖర్, సైదయ్య తదితరులు ఉన్నారు.



పెద్దవంగరలో ఆధార్ అవస్థలు..!

- సేవలకు రెండేళ్లుగా మండలం దూరం
- అప్‌డేట్‌కు ఇబ్బందులు - అప్డేషన్‌కు తొర్రూరు, కొడకండ్లకు...
- మండలంలో పునరుద్ధరించాలని ప్రజలు వేడుకోలు



నవతెలంగాణ-పెద్దవంగర

ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, ఇతర గుర్తింపు పత్రాలు తీసుకోవాలన్నా, విద్యార్థులు పై చదువులకు వెళ్లాలన్నా, ప్రస్తుతం మహిళలు ఆర్టీసీ బస్సు ఎక్కాలన్నా ఆధార్ తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలు దరఖాస్తుల స్వీకరణకు సైతం ఆధార్ కార్డు కీలకం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి, కొత్తగా పొందడానికి, ఉన్నవారు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవడానికి ఆధార్ సెంటర్ లేక మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ సేవల కోసం జిల్లాలోని తొర్రూరు, జనగాం జిల్లా కొడకండ్ల మండలాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ పథకాలకు ఆధారే పెద్ద దిక్కు.

ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు అందుకోవాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి. దీంతో పాటుగా వివాహం కావడం, ఇంటిపేరు, కేరాఫ్ చిరునామా, ఉద్యోగ, ఉపాధి రీత్యా, నివాసం, మొబైల్ నంబర్ మారడంతో అప్డేషన్‌కు ఆవశ్యకత ఏర్పడింది. రేషన్ బియ్యం తీసుకోవాలన్నా, ప్రతి ఒక్కరు ఆధార్ కలిగి ఉండాలి. మరి ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆధార్ నమోదు సెంటర్ మండలంలో సుమారు రెండేళ్ళ క్రితం మూతపడింది. దీంతో అప్పటి నుండి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో ఉండే.. కానీ...

గతంలో మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఉండేది. కానీ ఆధార్ కేంద్రం నిర్వాహకుడు ఆధార్ నమోదు ప్రక్రియలో తప్పిదాలు చేయడం వల్ల ఆధార్ కేంద్రాన్ని సుమారు రెండేళ్ళ క్రితం సంబంధిత అధికారులు బ్లాక్ చేశారు. అప్పటి నుంచి మండల వాసులు ఆధార్ సేవలకు దూరమయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలో ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి :


చెరుకు యాకయ్య, పెద్దవంగర



నా ఆధార్ కార్డులో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. మండలంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో తొర్రూరు మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి. అక్కడికి వెళ్లాక సర్వర్ రాకపోవడంతో సమయం, డబ్బు వృధాఅవుతుంది. మండలంలో ఆధార్ సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి.

వేలు ముద్రలు పడడం లేదు :

సుంకరి లక్ష్మీనర్సమ్మ, పెద్దవంగం



ప్రతి నెలా పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి వేలు ముద్రలు పడకపోవడంతో ఇబ్బంది పడుతున్నా. మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఇంకా ఆధార్‌అప్డేషన్ చేయించలేదు. పెద్దవంగర పట్టణ కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

సైబర్ నేరాలపై అప్రమతంగా ఉండాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



నవతెలంగాణ-మహబూబాబాద్

మండలంలోని ఒక వ్యక్తికి తెలియని నెంబర్ నుంచి అమ్మాయి డిపితో పార్ట్ టైం జాబ్ కావాలా అనే మెసేజ్ వచ్చింది. దానికి బాధితుడు సరే అని మెసేజ్ పెట్టగా, నేరస్తులు ఒక యూట్యూబ్ వీడియో లింక్ పెట్టి దాన్ని లైక్ అండ్ షేర్ చేసి దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను తనకు పెట్టమని చెప్పగా బాధితుడు ఆ విధంగా చేశాడు. ఇలా మూడుసార్లు మూడు టాస్కులు చేయగా మూడు టాస్కులకు గాను 150 రూపాయలు బాధితులు అకౌంట్‌కు పంపించారు. దానికి కొనసాగింపుగా అధిక మొత్తంలో ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయి అని చెప్పేసి బాధితుడి నమ్మించి బాధితుడు చేత లక్షల రూపాయలలో ఇన్వెస్ట్ చేయించారు. లాభాలు ఒక ఫేక్ వెబ్సైట్ ద్వారా చూపించారు. అవి బాధితులు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అవి కాలేదు. మీరు ఇంకా కొంత అమౌంట్ జమ చేస్తే అన్నీ కలిపి మీకు చివరికి వస్తాయని నమ్మించి బాధితుడి చేత సుమారు 12,00,000 వరకు మోసం చేశారు. చివరకు మోసాన్ని గమనించిన బాధితుడు 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఇదే తరహా టాస్క్ బేసిడ్ ఫ్రాడ్‌లో మహబూబాబాద్ జిల్లాలోని మరో వ్యక్తి సుమారు 32 లక్షల రూపాయలను పోగొట్టుకున్నాడు. ఈ విధంగా సైబర్ నేరుగాలు వివిధ రకాలుగా ఎత్తుగడలు వేసి బాధితులను మోసం చేసి అధిక మొత్తంలో డబ్బులను దోచుకుంటున్నారు. దీనిపై ప్రజలందరూ అప్రతంగా అవగాహనతో ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవేళ ఏమైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్ చేయడం ద్వారా లేదా www.cybercrime.gov.in వెబ్సైట్ ద్వారా ఎంత తొందరగా ఫిర్యాదు చేస్తే అంతగా డబ్బులను కాపాడుకునే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కెకన్ ప్రజలకు సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మహబూబాబాద్
గురువారం | మే 16, 2024 | www.navatelangana.com

ట్రాన్స్ జెండర్‌ల కోసం ప్రత్యేక వైద్యం

నవతెలంగాణ-మహబూబాబాద్



గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మహబూబాబాద్ యందు ప్రతి మంగళవారం ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా ఓపీ సేవలు గ్రౌండ్ ఫ్లోర్‌లోని రూమ్ నంబర్ 15లో ఏర్పాటు చేసినట్లు జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలను ట్రాన్స్ జెండర్లు ఉపయోగించుకోవాలని, ఏలాంటి వైద్య సదుపాయం కోసమైనా ఈ చికిత్స కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి : యుగేందర్

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



జన్మదినం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని భారత యాదవ సమితి మండలాధ్యక్షులు వల్లపు యుగేందర్ యాదవ్ అన్నారు. బుధవారం యుగేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని పెద్ద ముప్పారం అమ్మఒడి వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదినాలు సామాజిక సేవా కార్యక్రమాలకు నాందిగా మారడం గర్వకారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హైమద్ బాషా, ప్రతినిధులు రావుల కిషన్ రెడ్డి, మురళి, రహీం, మున్నా, మణి, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన వరి ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం
- తొర్రూర్ జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-తొర్రూరు



అకాల వర్షం కారణంగా వేలాది క్వింటాళ్ల వరి ధాన్యం తడిచి ముద్దైందని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తొర్రూరు జెడ్పీటీసీ, మహబూబాబాద్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. సమయానికి కాంటా పెట్టక, మిల్లులకు తరలించుటకు లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయక రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తూ రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రైతులకు మద్దతు ధర రూ.500 ఇస్తామని మోసం చేసిన ప్రభుత్వం కనీసం రైతు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దురదృష్టకరం,ఆరుగాలం పండించుకున్న పంట కండ్ల ముందే తడిసి ముద్దయి అమ్ముకోలేక అవస్థలు పడుతు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం స్పందించి కల్లాళ్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతుల ముందు ద్రోహిగా నిలబడిందన్నారు. రోజుకో మాట.. పూటకో మాట మాట్లాడుతూ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తూ నాటకాలు ఆడుతుందని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు, రైతులు తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.



ఎన్నికల కమిషన్ నిర్ణయించిన మేరకు రెమ్యూనరేషన్ చెల్లించాలి

- ఉపాధ్యాయ సంఘాలు

నవతెలంగాణ-మహబూబాబాద్

ఎన్నికలలో ఎలక్షన్ కమిషన్ నిర్ణయించిన మేరకు రెమ్యూనరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం మహబూబాబాద్ జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సాధారణ లోక్‌సభ ఎన్నికలలో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికలలో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు మిగతా జిల్లాల కన్నా తక్కువ రెమ్యూరేషన్ తక్కువగా ఇవ్వడం జరిగినదని, ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మిగతా జిల్లాలతో సమానంగా ఇవ్వాలని కోరారు. పిఓ,ఏపీఓ అధికారులకు ఎన్నికలకమిషన్ ఆదేశాల మేరకు రూ.3,150 చెల్లించవలసి ఉండగా మహబూబాబాద్ జిల్లాలో మాత్రం రూపాయలు రూ.2,550 చెల్లించారని, ఓపిఓలకు రూ.1,750 చెల్లించవలసి ఉండగా, రూ. 1,350 మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు, శంకర్ బద్రి నారాయణ, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చెంచు శ్రీశైలం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు చాగంటి ప్రభాకర్, యూటీఎఫ్ నాయకులు కోటూరు శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు కరుణాకర్ రెడ్డి, సోమ గోవర్ధన్, కోమేరె ఉప్పలయ్య, సామ సత్యనారాయణ రెడ్డి, సిహెచ్.శ్రీనివాస్, టీపీటీఫ్ నాయకులు ముత్యాల ప్రవీణ్, మేక కుమార్, జలగం వీరస్వామి, యూటీఎఫ్ నాయకులు మద్దెల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



అనాథలకు చేయూత

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రంలోని నిరుపేద కుటుంబాలు, అనారోగ్యంతో ఉన్నవారిని ఆదరించి వారికి పండ్లు ఆపిల్ జ్యూస్, పిడిఎస్ఎస్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అల్లం రమ నాగేశ్వరావు పెళ్లిరోజు పురస్కరించుకొని పండ్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరి పెళ్లి రోజున నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలని కోరుతూ మాకున్న దాంట్లో కొంత నిరుపేదలకు అనారోగ్యంతో ఉన్నవారికి సహాయం అందిస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పిడిఎస్ఎస్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు బనిశెట్టి విజయ-వెంకటేశులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పృథ్వీరాజ్ పుల్లెంల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన లింగాల నర్సమ్మ (80) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందారు. వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. నర్సమ్మ మృతి పట్ల కాంగ్రెస్ జిల్లా నాయకుడు కందాడి అచ్చిరెడ్డి, అమ్మాపురం బీఆర్ఎస్ అధ్యక్షుడు ముద్దం వీరారెడ్డి, ఎంపీటీసీ డోనుక ఉప్పలయ్య పలువురు నాయకులు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మార్క శ్రీనివాస్ గౌడ్, బూరుగు వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గన్న మాజీ మావోయిస్టు కాదు

నవతెలంగాణ-బయ్యారం

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఒక దిశా పత్రికా ముసుగులో ఉన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు జగ్గన్నకు మధ్య తగువు జరిగిందని జగ్గన్న మాజీ మావోయిస్టు కాదని సిపిఐ ఎంఎల్ ప్రజాపంద మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక మాఫియా అనడాన్ని సిపిఐ ఎంఎల్ ప్రజాపంద బయ్యారం మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ప్రజపంథా మహబూబాబాద్ డివిజన్ నాయకులు ఉమ్మగాని సత్యం, జక్కుల యాకయ్య, బయ్యారం టౌన్ కమిటీ నాయకులు గుర్రం పూర్ణ, భక్తుల ధనంజయ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులను...
సిద్ధం చేసుకోవాలి

- అడిషనల్ సీఈఓ లోకేష్ కుమార్

నవతెలంగాణ-మహబూబాబాద్



మే 27న నిర్వహించే నల్గొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకుని ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాలని అడిషనల్ సీఈఓ లోకేష్ కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుండి అడిషనల్ సీఈఓ లోకేష్ కుమార్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి హైదరాబాద్ నుండి వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలపై పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ విసి సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం.డేవిడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు తమ తమ జిల్లాలోని బ్యాలెట్ బాక్సులను తయారు చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని, రోజు వారీ నివేదికలు ఎప్పటికప్పుడు పంపాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో అవసరమైన బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, మహబూబాబాద్ ఆర్డీఓ ఎల్.అలివేలు, డిపిఓ, ఎలక్షన్ విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చెరుకు రసం

- శరీర బరువు తగ్గేందుకు దోహదం
- గల్లీ గల్లీలో మొబైల్ బండ్లపై విక్రయాలు
- ఉపాధి పొందుతున్న ఉత్తరప్రదేశ్ యువత

నవతెలంగాణ-తొర్రూరు



వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి సహజసిద్ధమైన పానీయాలు తాగేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. అలాంటి వాటిలో చరకు రసానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఎక్కడో ఒకచోట మాత్రమే లభించేది. ప్రస్తుతం పట్టణాలు, పల్లెలు, గల్లీ గల్లీలో అందుబాటులోకి వచ్చింది.దీనిపై ఉత్తరప్రదేశ్ యువత ఉపాధి పొందుతున్నారు. ఆరోగ్యంగా ఉండడంతో పాటు పౌష్టిక విలువలు ఉండడంతో తాగేందుకు ఉత్సాహం చూపుతున్నారు. బహిరంగ మార్కెట్లో చాలా పానీయాలు అందుబాటులో ఉన్నప్పటికీ చాలామంది ప్రకృతి సిద్ధంగా లభించే చెరుకు రసాన్ని తాగేందుకు మొగ్గుచూపుతున్నారు. ఎన్నో విటమిన్లు కలిగిన ఈ రసాన్ని తాగడానికి ఎక్కువమంది ఇష్టపడుతున్నారు.

అమ్మకాలు...

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలు కుటుంబాలు డివిజన్లోని పలు మండలాల్లో వలసకు వచ్చారు. సీజన్‌కు తగిన విధంగా వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రత్యేకంగా మొబైల్ చెరకు రసం బండ్లను తయారుచేసి పట్టణాల్లో, కాలనీలో తిరుగుతున్నారు. ఇళ్ల ఎదుటే వాహనాలను తీసుకువచ్చి తాజా రసాన్ని తయారు చేసి ఇస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి పిల్లలకు రోజు ఒక గ్లాసు చొప్పున తాగిస్తున్నారు. గ్లాస్ జ్యూస్ ధర రూ.20 మేరకు విక్రయిస్తున్నారు.

ఉపయోగాలు బోలెడు...

చెరకు రసం శరీర వేడిని తగ్గించి తక్షణ శక్తిని ఇస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటుగా జీర్ణ క్రియను వేగవంతం చేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను తొలగిస్తుంది. చెరకురసంలో క్రోమియం, మెగ్నీషియం, జింక్ వంటివి అధికంగా ఉంటాయి. శరీరంలో గ్లూకోజ్ లెవెల్స్‌ను క్రమబద్ధీకరించడంతో పాటుగా కామెర్లు, ఇన్ఫెక్షన్ రానివ్వకుండా పనిచేస్తుంది. అలసటను తగ్గించి ఆయసాన్ని దూరం చేస్తుంది. పిల్లల్లో తరచుగా వచ్చే చిన్నపాటి ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. రోజు తాగితే శరీర బరువు క్రమేపి తగ్గుతుంది. అందులో ఉండే క్యాల్షియం ఎముకలు, కండరాలకు శక్తినిస్తుంది.

ఔషధంలా పనిచేస్తుంది : డాక్టర్ జ్వలిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,తొర్రూరు



వేసవిలో ప్రజలకు చెరుకు రసం దివ్య ఔషధంలా పనిచేస్తుంది. అందులో క్యాల్షియం ఉన్న కారణంగా ఎముకలు, దంతాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. చిన్నారులకు చాలా మంచిది. పైగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా కాపాడే ఔషధ గుణాలు ఉన్నాయి.

నియంతృత్వ మతోన్మాదులకు చోటు లేదు

- సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్



మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి వామపక్షాల మద్దతు, ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాం నాయక్ భారీ మెజార్టీతో గెలుపొంద బోతున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని అమీనాపురం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య వాదులకు, మతోన్మాద వాదులకు మధ్య జరిగిన ఎన్నికల సమరభేరి అని అన్నారు. కమ్యూనిస్టులకు, వామపక్ష వాదులకు నిలయమైన మహబూబాబాద్ జిల్లాలో మతోన్మాద వాదులకు చోటులేదని మరోసారి ప్రజలు నిరూపించనున్నారని అన్నారు. ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమి లేదని, యువత, నిరుద్యోగులకు, రైతులకు, మహిళలకు, విద్యార్థులకు ఏం చేశారో చెప్పకుండా మతాలు, కులాల పేరుతో దేశంలో విధ్వంస కాండ సృష్టించి ప్రజలను రెచ్చగొట్టి ఓట్లను దండుకోవాలని చూసే వారికి ఈఎన్నిక గుణపాఠం అవుతుందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, పారిశ్రామిక కారిడార్ హామీలను అమలు చేయకుండా కేంద్ర బిజెపి సర్కార్ మోసం చేసిందన్నారు. బిజెపి పదేళ్ల పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేసిందని అందుకే ఈఎన్నికల్లో ప్రజలు బిజెపికి గుణపాఠం చెప్పే విధంగా తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ, నియంతృత్వాన్ని ఓడించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించిన సిపిఐ కార్యకర్తలకు, ఓటు వేసిన సిపిఐ పార్టీ శ్రేణులకు, ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి దాసరి లింగస్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

నవతెలంగాణ-భూపాలపల్లి

ఈ నెల 27వ తేదీన జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రల బై ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అదనపు ఎన్నికల అధికారులు లోకేష్ కుమార్, అదనపు సిఈఓ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి శాసనమండలి బై ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వణపై బుధవారం హైదరాబాద్ బీఆర్‌కే భవన్ నుంచి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంబో బ్యాలెట్ బాక్స్‌లు అదనపు బాలెట్ బాక్స్ లు సిద్ధం చేయాలని తెలిపారు. బ్యాలెబాక్స్‌లకు యూనిక్ నెంబర్లు వేయాలని అన్నారు.ప్రతిరోజు ఎన్నికల ప్రవర్తనా నియమావళి నివేదిక అందజేయాలని అన్నారు. ఫ్లైయింగ్‌స్క్వాడ్ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.విధులు కేటాయించిన సిబ్బందికి పోస్టల్ బాలేట్ జారీ చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో 16 పోలింగ్ కేంద్రాల పరిధిలో 8 వేల మంది పురుషులు, 4535 మంది మహిళలు మొత్తం 12,535 మంది పట్ట భద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 20 జంబో బాక్సులు, 1679 పెద్ద బాక్సులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించు సిబ్బంది నియామక ప్రక్రియ రేపటి వరకు పూర్తి చేసి మాస్టర్ ట్రైనర్లుచే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, సిపిఓ శామ్యూల్, ఆర్డిఓ మంగిలాల్ పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి

నవతెలంగాణ-మహాదేవపూర్

2024-25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలలో చేరేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ, మైనారిటీ విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు భూపాలపల్లి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివద్ధి అధికారి సునిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుండి 30 వరకు http://telanganaepass.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సర్టిఫికెట్లు జత చేయాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి : ప్రిన్సిపాల్ సుమన్

నవతెలంగాణ-గణపురం

స్థానిక మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25లోగా సమీప మీ సేవా కేంద్రంలో www.tsmodelschools.com ద్వారా దరఖాస్తు సమర్పించాలన్నారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు, విద్యార్థినిలకు పరిమిత సంఖ్యలో ఉచిత హాస్టల్ సదుపాయం ఉంటుందన్నారు పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తొందరగా ధాన్యాన్ని తరలించాలి

- తహసీల్దార్ కోడి చింతల రాజు

నవతెలంగాణ-నెల్లికుదురు

రైతులు పండించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని తొందరగా కాంటాలు నిర్వహించి పూర్తి చేయాలని తహసీల్దార్ కోడి చింతల రాజు అన్నారు. బుధవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలుచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడి ధాన్యం తడిసే అవకాశాలు ఉన్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం లేకుండా నిర్వాహకులు కాంటాలు నిర్వహించి కొనుగోలు చేసి తొందరగా కొనుగోలు కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. రైతులను ఇబ్బందులు పెట్టవద్దని అన్నారు. తొందరగా కాంటాలను నిర్వహించి లారీలలో మిల్లర్లకు పంపించే కార్యక్రమాన్ని మూడు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ పుల్లయ్య, వివో మంజుల, కొనుగోలు కేంద్రం కమిటీ అధ్యక్షురాలు బొల్లం అనిత, కార్యదర్శి గాండ్ల విజయ, ఇన్చార్జి బండి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డీఓపై చర్యలు తీసుకోవాలి : టీటీఎఫ్

నవతెలంగాణ-బయ్యారం

బాధ్యతాయుత ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రావాల్సిన రెమ్యూనరేషన్ మిగిలిన జిల్లాల వారి కంటే తమకు తక్కువ ఇచ్చారని,వారితో సమానంగా ఇవ్వమని అడిగిన ఉద్యోగులపై పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని, అలా చేయడం సరైనది కాదని టిఎస్ టిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య శ్రీకాంత్ నాయక్ అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తూ లాఠీచార్జ్ చేసిన అధికారులపై, విచక్షణారహితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్ ఢీకొని గీత కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ-పెద్దవంగర

ట్రాక్టర్ ఢీకొని గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండలం, గంట్లకుంట గ్రామానికి చెందిన గుర్రం యాదగిరి కల్లు గీత వృత్తిని కొనసాగిస్తూ, గ్రామంలో తనకున్న కొద్దిపాటి పొలం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నిన్న రాత్రి రోజు మాదిరిగానే కల్లు గీసి ఇంటికి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన పాయిలి వెంకన్న ట్రాక్టర్ అదుపుతప్పి ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలైన యాదగిరిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆదరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

- పార్లమెంట్ అభ్యర్థి కోనేటి సుజాత

నవతెలంగాణ-నెల్లికుదురు



బీఎస్పీ పార్టీని ఆదరించి ఏనుగు గుర్తుపై ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి కోనేటి సుజాత ఒక ప్రకటనలో బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన పార్టీ అభ్యర్థులను తలతన్నే విధంగా ప్రచారం నిర్వహించడం జరిగింది అని ఆమె అన్నారు. రాజ్యాంగ రక్షణకు బీఎస్పి దోహదం చేస్తుందని అన్నారు. నేను మీ వెంట ఉంటా మీ సమస్యలపై పోరాడుతానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు : బీజేపీ

నవతెలంగాణ-ములుగు

బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీర్ సీతారాంనాయక్ గెలుపు కోసం కషి చేసిన నాయకులు, కార్యకర్తలకు బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం కతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శిలమంతుల రవీంద్రచారి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ బై ఎలక్షన్లలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎలక్షన్ల సందర్భంగా పార్టీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని నియమించారని, ఈనెల 27న పట్టుభద్రుల ఎన్నికలలో ఆయనను గెలిపించాలని కోరారు. రాష్ట్ర పార్లమెంటులో అత్యధిక స్థానాలు గెలువబోతుందని అన్నారు. ఎస్టి మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జినుకల కష్ణాకర్ రావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు రాయించు నాగరాజు, వెంకటాపూర్ మండల అధ్యక్షులు పైడాకుల మల్లేష్, జిల్లా నాయకులు జాడి వెంకన్న, సునీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపానికి గురై మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-గణపురం



మనస్థాపానికి గురై మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్-భూపాల పల్లి జిల్లా గణపురం మండలంలోని నగరం పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నగరంపల్లి గ్రామానికి చెందిన మామిడిపెల్లి ప్రమీల(55)కు ఆరోగ్యం సరిగా లేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తనను ఆస్పత్రికి తీసుకెళ్లమమని కోరగా డబ్బులు లేక కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లలేదు. దీంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ములుగు సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

లక్నో చేరుకున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ -ములుగు



లక్నో నగరంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ దనసరి సీతక్క బుధవారం లక్నో చేరుకుని పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి బయలు దేరారు. ఏఐసీసీ ఆదేశాలను శిరసా వహిస్తూ, అరక్షణం కూడా విశ్రాంతి లేకుండా, తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, మహబూబ్‌బాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ఎనలేని కషి చేసి, వెంటనే ఐదవ విడత పార్లమెంట్ ఎన్నికల కోసం లక్నో చేరుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. సీతక్క వెంట కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కల్యాణి పాల్గొన్నారు.

ఎత్తైన ప్రదేశంలో కల్లాలు ఏర్పాటు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మహాదేవపూర్

అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా కల్లాలు ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. బుధవారం మహాముత్తారం మండలంలోని మినాజిపేట, రేగులగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అనూహ్యంగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం రాసులు తడవకుండా టార్పాలిన్‌లు కప్పాలని అవగాహన కల్పించారు. ధాన్యం కేంద్రానికి అనువైన ఎగువ ప్రాంత భూమిని గుర్తించాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తగు సంరక్షణ చర్యలు పాటించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం సకాలంలో రవాణా చేసేందుకు అవసరమైన సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని అన్నారు. ఓపీఎంఎస్ ప్రకారం తక్షణమే రవాణా, మిల్లర్ల ఇబ్బందులు రాకుండా దిగుమతి చేసేందుకు హమాలీలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-భూపాలపల్లి

అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా కల్లాలు ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని దీక్షకుంట, నందిగామ, పందిపంపుల, మహాముత్తారం మండలంలోని మినాజిపేట, రేగులగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనూహ్యంగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం రాసులు తడవకుండా టార్పాలిన్‌లు కప్పాలని రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యం కేంద్రానికి అనువైన ఎగువ ప్రాంత భూమిని గుర్తించాలని కొనుగోలు కేంద్రాల ఇంఛార్జిలను ఆదేషించారు. అకాలంగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పొలాల్లోకి నీరు చేరుతోందని తడవకుండా తగు సంరక్షణ చర్యలు పాటించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం సకాలంలో రవాణా చేసేందుకు అవసరమైన సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని అన్నారు. ఓ పి ఎం.ఎస్ ప్రకారం తక్షణమే రవాణా మరియు మిల్లర్ల ఎలాంటి ఇబ్బందులు రాకుండా దిగుమతి చేసేందుకు హమాలీలను అందుబాటులో ఉంచాలని ఆయన పేర్కొన్నారు.

గీతా కార్మికుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భూపాలపల్లి



తాటి చెట్టు పై నుండి పడి గీతా కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘ టన భూపాలపల్లి మండలం లోని కమలాపూర్ గ్రామంలో బుధ వారం చోటుచేసుకుంది. గ్రామస్తు లు తెలిపిన వివరాల ప్రకారం కమలాపూర్ గ్రామానికి చెందిన బుర్ర శంకర్ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాగా శంకర్ ను మెరుగైన వైద్య సేవల నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మోహన్‌లాల్

నవతెలంగాణ- ములుగు



ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను పొరుగు సేవల(ఔట్‌సోర్సింగ్) కింద భర్తీ చేసేందుకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మోహన్‌లాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో 32 ఖాళీలను ఔట్సోర్సింగ్ కింద భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. డిసెక్షన్ హాల్ అటెండెంట్ 4, డాటా ఎంట్రీ ఆపరేటర్ 10, ఆఫీస్ సబార్డినేట్ 8, థియేటర్ అసిస్టెంట్ 4, ల్యాబ్ అటెండెంట్ 4, రికార్డ్ అసిస్టెంట్ 2 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా పోస్టులకు వయస్సు, విద్యా అర్హతలు, దరఖాస్తు ఫామ్, ఇతర పూర్తి వివరాల కోసం హ్ట్‌జూం://ఎబశ్రీబస్త్రబ్.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చని అన్నారు. జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఫామ్‌ను డౌన్లోడ్ చేసుకొని ఈనెల 17 న ఉదయం 10:30గంటల నుండి 22వ తేదీ సాయంత్రం 05గంటల వరకు ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలోగాని, హెల్ప్ డెస్క్ నెంబర్ 7013952246లోగాని సంప్రదించొచ్చని సూచించారు.

'మంత్రి శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు'

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన కోల లక్ష్మి ప్రమాదవశాత్తు కిందపడి తలకు గాయమవ్వగా హైదరబాద్ నిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొందుతోంది. కాగా లక్ష్మి తలకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో లక్ష్మి కుమారుడు మహేష్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబుకు తెలిపారు. వారు మంత్రి దుద్దిల్ల శ్రీదర్‌బాబుకు విన్నవించగా ఆయన స్పందించి రూ.5లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేశారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులతోపాటు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, రాజబాబు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి





ఇతర రాష్ట్రాలకు చెందిన అధికారుల బృందం భూపాలపల్లి జిల్లాకు వస్తున్నారని, ఎలాంటి లోటు పాట్లు రాకుండా పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. బుధవారం ఐడీఓసీ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 20వ తేదీ నుండి 24వ తేది వరకు కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 మంది అధికారులు 5రోజుల పాటు జిల్లాలోని భూపాలపల్లి మండలం గొర్ల వీడు, కాటారం మండలం గంగారం, మహాదేవపూర్ మండలం కాళేశ్వరం, రేగొండ మండలం కొడవటంచ, గన్ పూర్ మండలం చెల్పూర్ గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై అధ్యయనం చేయనున్నట్టు తెలిపారు. అదే గ్రామాల్లో అధికారులు బస చేయాల్సి ఉన్నందున, ఎలాంటి లోటు పాట్లు రాకుండా చూడాలని ఎంపీడీఓలను ఆదేశించారు. గ్రామాల్లో పరిశీలించే అంశాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అధికారుల బృందానికి చూపించాలన్నారు. ఆరోగ్య సమస్యలు రాకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలు, స్మశానవాటికలు, డంపింగ్ యార్డులు తదితర అంశాలను పరిశీలించే అవకాశం ఉన్నందున అధికారులు సంసిద్ధంగా ఉండాలని అన్నారు. పర్యటన పర్యవేక్షణకు డీపీఓ నారాయణరావును నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి ఇన్స్టిట్యూట్ ట్రైనింగ్ మేనేజర్ కుమార్ స్వామి, డీపీఓ నారాయణరావు, డీఆర్డీఓ నరేష్, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. బుధవారం స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఓపీ రిజిస్టర్, శానిటైజేషన్ నుక్రిటికల్, కాజ్‌వాలిటి, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. గతంలో ఆపరేషన్ థియేటర్‌కు కావాల్సిన వైద్య పరికరాలకు నిధులు మంజూరు చేయగా కొనుగోలు చేసిన వైద్య పరికరాలను పరిశీలించారు. గతంలో ఆస్పత్రికి 5 ఏసీలు మంజూరు చేయగా వాటి వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల వ్యాధుల బారిన పడిన ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి చికిత్స తీసుకోకుండా స్థానిక వంద పడకల ఆస్పత్రి లోనే ఆర్థో సేవలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వైద్యులు ఓపీ కోసం వచ్చే రోగులు నిలబడవలసి వస్తుందని, రోగులకోసం 60 త్రీ సీటర్ చైర్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, చికిత్సకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని అన్నారు. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ కోడూరి నవీన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

- ఇసుక క్వారీ వద్ద మృతుడి బంధువుల ధర్నా

నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ



ఏటూరునాగారం మండల కేంద్రానికి సమీపాన గోదావరి తీరంలో కొనసాగుతున్న ఇసుక క్వారీ వల్ల యువకుడు మతి చెందాడని, మతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి బంధువులు బుధవారం సుమారు రెండు గంటల పాటు ఇసుక లారీలను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. మంగళవారం రాత్రి మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన యువకుడు గుగ్గిళ్ళ రమేష్ ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి కమలాపురం వస్తుండగా ఇసుక లారీలను దాటించే సమయంలో లారీ డ్రైవర్లు మద్యం మత్తులో ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మతి చెందాడని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ఇసుక క్వారీలను నిలిపివేయాలన్నారు. ప్రభుత్వం గోదావరిలో తోడుకోవడానికి ఇసుకకు మాత్రమే అనుమతి ఇచ్చిందని జాతీయ రహదారిపై లారీలు నిలపడానికి అనుమతులు లేవన్నారు. అధికారులు కూడా క్వారీ నిర్వహకులు ఇచ్చే మామూళ్ల మత్తులో మునిగిపోవడంతో అమాయక ప్రజలు లారీలధాటికి బలైపోతున్నారన్నారు. పోలీసులు రెవెన్యూ ఇతర శాఖల అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో క్వారీ నిర్వాహకులు, లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రహదారికి పక్కన కొనసాగుతున్న ఇసుక క్వారీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీగా ప్రతిరోజు ఉద్యమాలు చేస్తామని ఏజెన్సీ ప్రాంత ప్రజల హెచ్చరిస్తున్నారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్వీపి సూర్య చంద్రకళ

నవతెలంగాణ- ములుగు



జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అధిక కేసుల పరిష్కారం కోసం వివిధ శాఖ అధికారులు సమన్వయం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్వీపీ సూర్య చంద్రకళ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి సూర్య చంద్రకళ మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక కేసుల పరిష్కారానికి సంబంధిత అధికారులు సహకరించాలని అన్నారు. రాజీ పడదగు కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాజీమార్గం ద్వారా వారి కేసును పరిష్కరించుకోవాలని అన్నారు. లోక్ అదాలత్ పట్ల న్యాయ సలహాల కోసం న్యాయ సేవా అధికార సంస్థలను ఆశ్రయించొచ్చని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిషనల్ ఆఫీసర్ కే సత్యపాల్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కే శ్రీనివాస్‌కుమార్, డీఎస్పీ (డీసీఆర్బీ) ఏ రాములు, పరకాల సబ్ జైలు సూపరింటెండెంట్, ఎన్ ప్రభాకర్, ఎక్సైజ్ సీఐ ఎం సుధీర్‌కుమార్, వెంకటాపురం సిఐ బండారి కుమార్, ఎస్ఐ ఆర్ అశోక్, ఎస్ఐ (డిసిఆర్బి) షైక్ మస్తాన్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జే ఎమ్ స్వర్ణలత లెనినా, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జే ఓంకార్, సీడీపీఓ కే స్వాతి, వరంగల్ డీపీఓటీ రాధ, స్టేషన్‌హౌజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ ములుగు జిల్లా కమిటీ కార్యాలయం ప్రారంభం

- ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఎన్‌హెచ్‌ఆర్సీ
- రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య

నవతెలంగాణ -ములుగు



ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రహదారి గిరిజన భవన్ సమీపంలో జాతీయ మానవ హక్కుల ములుగు జిల్లా కమిటీ(ఎన్‌మెచ్‌ఆర్సి) కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య బుధవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పెట్టెం రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భద్రయ్య మాట్లాడారు. పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సి పని చేస్తుందని స్పష్టం చేశారు. అవినీతి అక్రమార్కులను సమాజంలో దోషులుగా చూపించడం, ప్రభుత్వ ప్రజాధనాన్ని కాపాడడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి పలు రాష్ట్ర కమిటీలతో పాటు 33 జిల్లాల కమిటీలను విజయవంతంగా పూర్తి చేశామని అన్నారు. అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం త్వరలో కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎన్‌హెచ్‌ఆర్సీ బలపరిచిన పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పూజారి సత్యనారాయని ఆదరించాలన్నారు. ములుగు జిల్లా నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. అనంతరం పెట్టెం రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అభ్యర్థి సత్యనారాయణ గెలుపు కోసం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఈసీ సభ్యులు గోగులమూడి హరికష్ణ, కుంట ఏడుకొండలు, జి సంజీవ, వేణురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల కష్ణ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గాదే శ్రీనివాసచారి, బొచ్చు రాజేందర్, జిల్లా ఎన్నికల కన్వీనర్ కొడిపాక రవి, మండల కమిటీ అధ్యక్షులు తాళ్లూరి మధుకర్, అలం శ్రీను, గోపు స్వరాజ్యలక్ష్మి, గోగు కవిరాజు, కంచు కుమారస్వామి, సంగ శివయ్య, పద్మ గంగయ్య, సోషల్ మీడియా కత్తుల రమేష్, ఓరుగంటి కుమారస్వామి, ములుగుటౌన్ ప్రధాన కార్యదర్శి బలుగురు జనార్దన్, పది మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఇసుక లారీలను నియంత్రించాలి : బీఆర్ఎస్

నవతెలంగాణ- ములుగు



ములుగు జిల్లాలో ఓవర్ లోడ్ ఇసుక లారీలను నియంత్రించి, సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కోకిల మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. సరైన నియంత్రణ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో లారీ డ్రైవర్లు ఓవర్ లోడ్‌తో, ఓవర్ స్పీడ్‌తో, మద్యం సేవించి నడపడం వల్ల ములుగు జిల్లా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పటివరకు చాలామంది ఇసుక లారీల ప్రమాదంలో మరణించారని అన్నారు. జిల్లా అధికారులు ఇసుక లారీలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. లేదంటే రెండు రోజుల్లో 163వ జాతీయ రహదారిని నిర్బంధించి, ఇసుక లారీలను నడవకుండా ఆందోళన చేపడతామని తెలిపారు. గత ప్రభుత్వంలో రాత్రి 8 గంటల నుండి ఉదయం 6 గంటలకు మాత్రమే ఇసుకను తరలించే విధంగా పర్మిషన్ ఉండేదని అన్నారు. నూతన ప్రభుత్వంలో అడ్డుఅదుపు లేకుండా పోతోందని అన్నారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బందెల రాజేశ్వరి స్మారక క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-మహాదేవపూర్

మండలంలోని కాళేశ్వరం గ్రామంలో బందెల రాజేశ్వరి స్మారకార్థం కాళేశ్వరం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్నట్టు ఎంపీటీసీ రేవెల్లి మమతా నాగరాజు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న ప్రారంభమయ్యే క్రికెట్ పోటీలకు కాళే శ్వరం పోలిస్‌స్టేషన్ పరిధిలోని జట్లు పాల్గొనాలని అన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతులు అందజేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 7780593127, 7411535405, 8121400168 నెంబర్లలో సంప్రదించొచ్చని సూచించారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : సీపీఐ



నవతెలంగాణ - ములుగు

జిల్లాలో రైతుల ధాన్యంను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ అంజాద్ పాషా డిమాండ్ చేశారు. ములుగు మండలంలోని జగ్గన్నపేట, మదనపల్లి, జంగాలపల్లి రైతుల ధాన్యం సెంటర్లను సీపీఐ బందం బుధవారం సందర్శించింది. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓ రాజ్‌కుమార్, పౌరసరఫరాల డీఎం రాంపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అంజాద్ పాషా మాట్లాడుతూ.. అన్ని సెంటర్లలో గత పది రోజులుగా ధాన్యం ఆరబోసి రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అకాల వర్షాల వల్ల సెంటర్‌లో సౌకర్యాలు లేక రైతులకు భారీ నష్టం జరుగుతుందని అన్నారు. సెంటర్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేదంటే రైతులందరిని సమీకరించి ఆందోళనలు ఉదతం చేస్తామనిబ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, బి నారాయణసింగ్, జి రమేష్, రైతులు శ్రీనివాసు, వెంకటయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందించాలి : ఎస్టీయూ

నవతెలంగాణ- ములుగు

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బూర్గుపేట ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కొత్తగూడెం-భద్రాద్రి జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉండి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై హైదరాబాద్ లో చికిత్స పొందుతున్న పొరిక మధుకుమార్‌కు ఎక్స్ గ్రేషియా చెల్లించి మెరుగైన చికిత్స అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ ములుగు జిల్లా శాఖ కోరింది. బుధవారం జిల్లా కలెక్టర్‌కు, కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీష్ కుమార్, ఏళ్ళ మధుసూదన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోరిక మోహన్ లాల్, మూడ్ కసన్ సింగ్, బంజార ఉద్యోగ సంఘ నాయకులు సునీల్, సర్వన్ కుమార్, సారయ్య నాయక్, సోమా నాయక్, జయరాం, రఘురాం, నరేందర్, లావుడ్య రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి, మాజీ కేంద్రమంత్రి పరామర్శ

హైదారాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు పొరిక మధు కుమార్‌ను మంత్రి సీతక్క, మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ బుధవారం పరామర్శించారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మధు కుమాం ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ ప్రారంభం

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్ రేంజ్ పరిధి సూరారం, ఎల్కేశ్వరం, పలుగుల యూనిట్ల పరిధిలో బుధవారం నుండి తునికాకు సేకరణ ప్రారంభమై నట్టు రేంజ్ ఆఫీసర్ కమల, సూరారం సెక్షన్ ఆఫీసర్ అరుణ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ తుని కాకు సేకరణ ప్రారంభమైనట్టు తెలిపారు. 50 ఆకుల కట్టకు రూ.3చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించినట్టు తెలిపారు. కాగా తునికాకు సేకరణ కూలీలకు ప్రమాద బీమా, తునికాకు కల్లాల వద్ద మంచి నీటి సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సూదుల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి పొలం రాజేందర్ కోరారు.